ఐలమ్మ పోరాటం తరతరాలకు స్ఫూర్తి


చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, తదితరులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం : తెలంగాణ తెగువకు ప్రతీక చాకలి ఐలమ్మ అని, ఆమె పోరాటం భవిష్యత్తు తరాలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి ఎమ్మెల్యే పద్మావతి కాలనీలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఓబేదుల్లా కొత్వాల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు షబ్బీర్ అహ్మద్, ఇందిర, బెక్కరి అనిత, పెద్ద విజయ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి రజక సంఘం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ నేర విభాగం : తెలంగాణ సాయుధ పోరాటంలో, జమీందారి వ్యవస్థకు, నిర్బంధ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన వీర నారీమణి చాకలి ఐలమ్మ అని ఎస్పీ డి.జానకి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్పీ రాములు, ఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీలు రమణారెడ్డి, శ్రీనివాసులు, సీఐ శివకుమార్, ఆర్ఐ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎస్పీ డి.జానకి, చిత్రంలో అదనపు ఎస్పీ రాములు, పోలీసులు

పాలమూరుకు పర్యాటక శోభ

మూడు విభాగాలుగా అభివృద్ధికి సర్కారు ప్రణాళికలు

ఈనాడు, మహబూబ్‌నగర్ : నల్లమల అందాలు, దేవాలయాలు, పురాతన కోటలు, కృష్ణా, తుంగభద్ర నదులు వంటి ఎన్నో పర్యాటక ప్రాంతాలకు పాలమూరు నెలవు. ఇప్పటికే పర్యాటకులు పాలమూరుపై ఆసక్తి చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పర్యాటక రంగాన్ని ప్రకృతి, ఆధ్యాత్మికం, నది విభాగాలుగా విభజించి కొత్త పుంతలు తొక్కించాలని యోచిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లోనూ నల్లమల ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. జులై మొదటి వారంలోనూ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు నల్లమలను సందర్శించి పర్యాటక రంగాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్నదానిపై సమీక్ష నిర్వహించారు. 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా 'ఈనాడు' ప్రత్యేక కథనం.

నల్లమలే ప్రత్యేక ఆకర్షణ..

ఉమ్మడి జిల్లాలో అత్యంత కీలక పర్యాటక ప్రాంతం నల్లమలే. ఇక్కడికి ఇతర దేశాల నుంచి కూడా పర్యాటకులను రప్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే కొల్లాపూర్ అటవీ ప్రాంతంలోని అమరగిరి వద్ద పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందిస్తోంది. నల్లమలలో ప్రకృతి, ఆధ్యాత్మిక, నది విభాగాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేయనున్నారు. సోమశిల నుంచి కృష్ణానదిలో పడవ ప్రయాణం చేస్తూ పాతాళగంగ, శ్రీశైల మల్లికార్జునస్వామి దర్శనం చేసుకునేలా గతంలో పర్యటక శాఖ ఎకో టూరిజం అభివృద్ధి చేసింది. పర్హాబాద్ వ్యూపాయింట్, మల్లెల తీర్థం, సోమేశ్వరాలయాలను కూడా చూడవచ్చు. నల్లమల అభయారణ్యంలోనూ జంగిల్ సఫారీకి ఏర్పాట్లు చేయనున్నారు. ట్రెక్కింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారు.


నల్లమలలోని ప్రకృతి అందాలు


జోగులాంబ అమ్మవారి ఆలయం

ఆధ్యాత్మిక క్షేత్రాల నిలయం

తెలంగాణలోని ఏకైక శక్తిపీఠం జోగులాంబ అమ్మవారు అలంపూర్‌లో ఉన్నారు. తెలంగాణ తిరుపతిగా పేరు గాంచిన మన్యంకొండ దేవాలయానికి వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తారు. గద్వాలలోని జములమ్మ, మల్దకల్‌లోని వేంకటేశ్వరస్వామి, బీచుపల్లిలోని ఆంజనేయస్వామి, శ్రీరంగాపూర్‌లోని శ్రీరంగనాయకస్వామి, సింగోటంలోని లక్ష్మీనర్సింహస్వామి, ఉమామహేశ్వర ఆలయం, సలేశ్వరం, కురుమూర్తి, గంగాపూర్ చెన్నకేశవ స్వామి వంటి ప్రముఖ ఆలయాలను కలుపుతూ ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ భావిస్తోంది. హైదరాబాద్, మహబూబ్‌నగర్ నుంచి ప్రత్యేక టూరిజం బస్సుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. గైడ్‌లను నియమించి ఉపాధి కల్పించనున్నారు.

వీటిపైనా దృష్టిపెడితే బాగు..

మహబూబ్‌నగర్ శివారులో తెగుళ్లతో దెబ్బతిన్న పిల్లలమర్రి చెట్టు సస్యరక్షణ చర్యల తర్వాత పునరుజ్జీవం పొందింది. ఇక్కడ జింకల పార్కు, చేపల మ్యూజియం ఉన్నాయి. ఇటీవల పర్యాటకుల సందర్శనకు అవకాశం కల్పించటంతో ఈ ప్రాంతానికి కొత్త శోభ వచ్చింది. నారాయణపేట జిల్లా మూడుమాల్‌లో కాలగణనకు ఏర్పాటుచేసిన పురాతన నిలువు రాళ్లు ఉన్నాయి. హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని జడ్చర్ల సమీపంలో క్రీ.శ. 12వ శతాబ్దంలో జైనులు నిర్మించిన గొల్లత్తగుడి ఉంది. ఈ గుడిని పరిరక్షించి పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

అంగన్‌వాడీల్లో ఇష్టారాజ్యం

- కేంద్రాలకు ఒకరిద్దరు చిన్నారులే రాక
- పలుచోట్ల వంటే లేదు

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల కేంద్రాలను బలోపేతం చేసేందుకు ఎన్నో చర్యలు చేపడుతున్నాయి. వీటిని పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. క్షేత్రస్థాయిలో వీటి పరిస్థితి మాత్రం అధ్వానంగా ఉంది. కనీసం బాలింతలు, గర్భిణులకు పోషకాహారం కూడా అందించడం లేదు. ఏవో కారణాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు విధులకు హాజరవడం లేదు. గురువారం 'న్యూస్‌టుడే' జిల్లా వ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించగా ఒకరిద్దరు చిన్నారులే కనిపించారు. చాలా కేంద్రాలకు భోజనం చేసేందుకు బాలింతలు, గర్భిణులు రాలేదు. వచ్చినట్లు హాజరు నమోదు చేసుకుంటున్న సిబ్బంది వారికి అందించాల్సిన గుడ్లు, పోషకాహారం ఏం చేస్తున్నారో అధికారులకే తెలియాలి. అంగన్‌వాడీ కేంద్రాలను కాలనీల్లో ఎవరి కన్నూ పడకుండా మూలకు నిర్వహిస్తున్నారు. కేంద్రాలకు బోర్డులు కూడా లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

రాజాపూర్ : తిర్మలాపూర్‌లోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రం మూసి ఉంది. ఇక్కడి టీచర్ అనిత ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయా ఉండగా ఆమెకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి కేంద్రానికి రాలేదు.

భూత్పూర్ : భూత్పూర్ పురపాలిక పరిధి నర్సింగాపూర్‌లో మినీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఇద్దరు గర్భిణులు, నలుగురు బాలింతలు ఉండగా గురువారం ఎలాంటి భోజన సదుపాయం కల్పించలేదు.

మిడ్జిల్ : మిడ్జిల్ మండలం బైరంపల్లి కేంద్రంలో ఏడాదిగా ఆయా పోస్టు ఖాళీగా ఉంది. కేంద్రంలో గ్యాస్ సిలిండర్ లేకపోవడంతో కార్యకర్త ఇంటి వద్ద వంట చేసి కేంద్రానికి తీసుకొస్తున్నారు.



బాలానగర్ : బోడజానంపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో 17 మంది చిన్నారులకు గాను ముగ్గురే వచ్చారు. గర్భిణులు 7, బాలింతలు నలుగురు ఉంటే మధ్యాహ్న భోజన సమయంలో ఒక బాలింత వచ్చారు.


ఇద్దరు చిన్నారులున్న బోయపల్లిగేట్‌లోని మోనప్పగుట్ట అంగన్‌వాడీ కేంద్రం

- బోయపల్లి గేటు సమీపంలో ఉన్న మోనప్పగుట్ట అంగన్‌వాడీ కేంద్రంలో 10 మంది చిన్నారులు, 8 మంది గర్భిణులు, బాలింతలు నమోదయ్యారు. మధ్యాహ్నం కేంద్రాన్ని పరిశీలించగా ఇద్దరు చిన్నారులే వచ్చారు. ఆయా మాత్రం మూడు గ్లాసుల అన్నం వండుతున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్త విధుల్లో లేరు. ఆయాను ఆరా తీయగా వేరే విధులకు వెళ్లినట్లు చెప్పారు.

పరిశీలించి చర్యలు చేపడతాం.. : సూపర్‌వైజర్ల కొరత వల్ల అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. ఎక్కడెక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో గుర్తించి చర్యలు తీసుకుంటాం.

- జరీనా బేగం, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి

- ఒకే ఒక చిన్నారి కనిపిస్తున్నది క్రిస్టియన్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం. ఇక్కడ 12 మంది చిన్నారులు, 10 మంది గర్భిణులు, బాలింతలు భోజనానికి రావాల్సి ఉండగా, ఇక్కడ అసలు అన్నమే వండలేదు. తనకు ఆరోగ్యం బాగాలేక ఈ రోజు వండలేదని ఆయా బదులిచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్త బీఎల్‌వో విధులకు వెళ్లినట్లు ఆయా చెప్పారు.


ఒకే ఒక చిన్నారి, ఆయా ఉన్న క్రిస్టియన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం

- ఇది ఎర్రసత్యం కూడలిలోని పాల్‌సాబ్‌గుట్ట కేంద్రం. ఇక్కడ పని చేసే ఆయా కొన్ని రోజులుగా రావడం లేదు. బాలింతలు, గర్భిణులకు భోజనం వండటం లేదు. వండుకొని తినమని బాలింతలు, గర్భిణులకు ఇంటికే సరుకులను ఇస్తున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్త తెలిపారు. ఇక్కడికి ఒక గర్భిణి మాత్రమే వచ్చారు. చిన్నారులు రాలేదు.


సరకులు ఇంటికే ఇస్తున్న ఎర్రసత్యం కూడలిలోని పాల్‌సాబ్‌గుట్ట కేంద్రం కార్యకర్త

రాష్ట్రంలోనే అత్యధిక క్లబ్‌ల ఏర్పాటు

పురస్కారానికి ఎంపికైన మహబూబ్‌నగర్ కలెక్టర్


విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్రంలోనే అత్యధికంగా యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసినందుకు గాను ఈనెల 27న హైదరాబాద్‌లో నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అవార్డు అందుకోనున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, పాలమూరు విశ్వవిద్యాలయం, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో సుమారు 1,350కి పైగా యువ టూరిజం క్లబ్బుల ఏర్పాటుకు కలెక్టర్ కృషి చేశారు. ఒక్కో క్లబ్‌లో 25 మంది విద్యార్థులు ఉంటారు. పర్యాటకం, సంస్కృతీ సంప్రదాయాలు, వారసత్వ సందపపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ క్లబ్‌ల లక్ష్యం. భవిష్యత్తులో పర్యాటకం వల్ల కలిగే లాభాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పర్యాటక అనుబంధ రంగాల అభివృద్ధి తదితర అంశాలపై చిన్నప్పటి నుంచే అవగాహన పెంచుకునే అవకాశం యువ టూరిజం క్లబ్బుల ద్వారా విద్యార్థులకు కల్పించినందుకు గాను ఈ పురస్కారం దక్కనుంది.

పల్లీ రైతుల పరేషాన్

వేరుశనగ విత్తనాలకు రెక్కలు


అనంతపురం వేరుశనగ విత్తనాలతో రైతు నారాయణరెడ్డి

కల్వకుర్తి, న్యూస్‌టుడే: వేరుశనగ రైతులు విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. విత్తనాలు కొనబోతే ధరలు ఆకాశంలో ఉంటుండగా అమ్మబోతే గిట్టుబాటు లేక విలవిలలాడే పరిస్థితి నెలకొంది. రెండు రోజుల నుంచి వర్షం పడుతుండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యాసంగి వేరుశనగ సాగు మొదలైంది. విత్తనం కొనుగోలుకు డిమాండ్ ఉండటంతో వ్యాపారులు ధరలు పెంచారు. ఆగస్టులో క్వింటా వేరుశనగ విత్తనానికి రూ. 9,000 నుంచి రూ. 11,600 వరకు ధరలకు అమ్మారు. సెప్టెంబరులో రూ. 12,000 నుంచి 13,800 వరకు పెరిగింది. క్వింటా రూ. 2,500 నుంచి రూ. 3,000 వరకు ధరలు పెంచడంతో రైతులకు ఆర్థిక భారంగా మారింది. ఎకరానికి 65 కిలోల విత్తనాలు కావాల్సి ఉండటంతో పెద్దరైతులు మంచి విత్తనం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, తిరుపతి జిల్లాల్లోని పల్లి మిల్లులు, రైతుల చెంతకు పరుగులు తీస్తున్నారు. 2024 మార్చిలో రైతులు వేరుశనగను క్వింటాకు రూ. 4,100 నుంచి రూ. 7,600 వరకు మార్కెట్‌లో అమ్మారు.

- 2023లో యాసంగిలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2.20 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. ప్రస్తుతం వర్షాలు పుష్కలంగా కురవటంతో వేరుశనగ సాగు 2.60 లక్షల ఎకరాలకు పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. ఉమ్మడి జిల్లాలో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో అధికంగా సాగు చేస్తారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మిడ్జిల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో అధికంగా వేరుశనగ విత్తుతారు.

ఆంధ్రప్రదేశ్‌కు పరుగులు..: మిడ్జిల్, ఊర్కొండ మండలాలకు చెందిన రైతులు నేరుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా రైతుల నుంచి కే-6, 1694 రకాలను క్వింటా రూ. 13,000 చొప్పున కొనుగోలు చేశారు. ఈ రెండు రకాల విత్తనాలను 305 కిలోల విత్తనాలను కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. స్థానికంగా దొరికే వేరుశనగ విత్తనం కన్నా అనంతపురంలో కొనుగోలు చేసిన విత్తనం క్వింటా రూ. వెయ్యి తక్కువకే వస్తోందని మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామ రైతు సింగిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.

- **వనపర్తి విత్తన శుద్ధి కేంద్రం ద్వారా..:** ఉమ్మడి జిల్లాలో వనపర్తిలోని తెలంగాణ విత్తనోత్పత్తి సంస్థ ద్వారా ఊర్కొండ, మిడ్జిల్, కల్వకుర్తి, వంగూరు, ఉప్పునుంతల, గద్వాల, అలంపూర్ మండలాల రైతులు అధిక మొత్తంలో విత్తనం వేరుశనగ కాయలు కొనుగోలు చేసి, మిల్లుల్లో విత్తనంలా మార్చి అమ్మకాలు చేస్తున్నారు.

- వేరుశనగ విత్తనాలు ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాలో అందుబాటులో లేవు. ప్రభుత్వం రాయితీపై అందించడం లేదు. వనపర్తి విత్తనోత్పత్తి సంస్థలో కే-6, కదిరి లేపాక్షి-1812 రకాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్నాం..: వేరుశనగ విత్తనంపై ధరలు నిర్ణయం మా పరిధిలో లేదు. రైతులే ఇతర ప్రాంతాలకు వెళ్లి విత్తనం కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసేలా అవగాహన కల్పిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు.

ఏడాదిలోగా స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు తరలించండి

- రైతులకు నష్టపరిహారం అందజేయాలి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



ఈనాడు, హైదరాబాద్ : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కోడిచర్ల, తీగాపూర్, గుండ్లపట్లపల్లి, రంగారెడ్డిగూడ, అప్పాజిపల్లి తండా గ్రామాల పరిసరాల్లో మానవ నివాసాలకు కిలోమీటరు పరిధి లోపల ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను ఏడాదిలోగా తరలించాలంటూ ప్రభుత్వానికి ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పరిశ్రమలను తరలించాక నివేదికను హైకోర్టు జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌కు సమర్పించాలని ఆదేశించింది. అక్కడి మిగిలిన పరిశ్రమలు పర్యావరణ చట్టాలకు అనుగుణంగా నడుస్తున్నాయో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు నెలల్లో నివేదిక అందజేయాలని ఆదేశించింది. పంట నష్ట పరిహారంగా పరిశ్రమలు డిపాజిట్ చేసిన సొమ్మును రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇంకా స్పాంజ్ ఐరన్ పరిశ్రమలతో పంట నష్టపోయిన రైతులు ఉంటే చట్టప్రకారం వారిని గుర్తించి పరిహారం అందజేయాలని ఆదేశిస్తూ 19 ఏళ్ల పిటిషన్‌పై విచారణను ముగించింది. ఉమ్మడి జిల్లాలోని కోడిచర్ల, తీగాపూర్, గుండ్లపట్లపల్లి, రంగారెడ్డిగూడ, అప్పాజిపల్లి తండా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో స్పాంజ్ ఐరన్ పారిశ్రామిక యూనిట్లు నిర్వహిస్తుండటాన్ని సవాలు చేస్తూ 2005లో షాద్‌నగర్‌కు చెందిన టి.వీరేందర్‌రెడ్డి మరో 8 మంది ప్రజాప్రయోజన పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఈ పరిశ్రమల కాలుష్యం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని, వ్యవసాయం చేయలేకపోతున్నట్లు తెలిపారు. పచ్చదనం హరించుకుపోతోందని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కాలుష్య నివారణకు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు చర్యలు తీసుకోవడంలేదని పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు ఆదేశాల మేరకు పీసీబీ నివేదికను సమర్పించింది. జైసీ స్పాంజ్ ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతి ఉద్యోగ్ లిమిటెడ్, జి.కె.స్పాంజ్ ఐరన్ ప్రైవేట్ లిమిటెడ్, శీతల్ షిప్పింగ్ అండ్ మెటల్ ప్రాసెసర్స్ లిమిటెడ్, బింజు మెటల్స్ అండ్ అలాయ్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, హార్మొనీ స్పాంజ్ ఐరన్ ఇండస్ట్రీ, శివధాత్రి ఫెర్రో అల్లాయ్స్, ఏపీఎస్ఎం అల్లాయ్స్ ప్రైవేట్ లిమిటెడ్, దేవశ్రీ ఇస్పాత్ లిమిటెడ్‌లు పనిచేయడంలేదని పేర్కొంది. బిలస్రాయికా స్పాంజ్ ఐరన్ ఇండియా, బింజుసారియా స్పాంజ్ అండ్ పవర్, ఆనంద్ మెటాలిక్స్ అండ్ పవర్, సుందర్ ఇస్పాత్ లిమిటెడ్, వినాయక స్టీల్స్, రాయిటర్ మెటల్స్ ఆఫ్ ఇండియా, కేడియా అల్లాయ్స్ లిమిటెడ్, సిరి శివశక్తి స్టీల్స్ అల్లాయ్స్‌లు ఎన్జీటీని ఆశ్రయించాయని, దీనిపై 2022లో ఎన్జీటీ ఉత్తర్వులు జారీచేస్తూ జనావాసాలకు కి.మీ. లోపు ఉన్నవాటిని తరలించాలని ఆదేశించిందని తెలిపింది. టీఎస్ఐఐసీ 2020లో ప్రణాళిక సమర్పిస్తూ నివాస ప్రాంతాలకు సమీపంలో ఉన్న ఆనంద్ మెటాలిక్స్ అండ్ పవర్, సుందర్ ఇస్పాత్ లిమిటెడ్, వినాయక స్టీల్స్, రాయిటర్ మెటల్స్ ఆఫ్ ఇండియా, కేడియా అల్లాయ్స్ లిమిటెడ్, సిరి శివశక్తి స్టీల్స్ అల్లాయ్స్‌లను మరోచోటికి తరలించాలని సిఫారసు చేసిందని తెలిపింది. బిలస్రాయికా స్పాంజ్ ఐరన్ ఇండియా, బింజుసారియా స్పాంజ్ అండ్ పవర్, రాయిటర్స్ మెటల్స్ ఆఫ్ ఇండియా పరిశ్రమలు జనావాసాలకు కిలోమీటరు కంటే ఎక్కువ దూరంలో ఉన్నట్లు వివరించింది. వీటన్నింటినీ పరిశీలించిన ధర్మాసనం జనావాసాలకు కిలోమీటరు దూరంలో లోపల ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను తరలించి నివేదికను సమర్పించాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేసింది.

నిలిచిన రాకపోకలు

మిడ్జిల్, న్యూస్‌టుడే: కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తూర్-వెలుగొముల గ్రామాల మధ్య మూడు రోజులుగా దుందుభి వాగు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. దుందుభి వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కోయిలసాగర్ ఐదు గేట్లు ఎత్తివేత

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : కోయిలసాగర్ జలాశయం నుంచి ఐదు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినట్లు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వరదనీరు జలాశయంలోకి పెద్దఎత్తున వచ్చి చేరుతుండటంతో జలాశయం నుంచి ఐదు గేట్లను ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు చెప్పారు. జలాశయం గేట్ల ఎత్తడంతో వాగు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైతులకు పరిహారం చెల్లించేవరకు వదిలిపెట్టం : ఎంపీ


ఎంపీ డీకే అరుణకు తమ సమస్యలు వివరిస్తున్న ఉదండాపూర్ భూ నిర్వాసితులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించే వరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. గురువారం మహబూబ్‌నగర్‌లోని ఆమె క్యాంపు కార్యాలయానికి చేరుకున్న ఉదండాపూర్ భూనిర్వాసితులు పరిహారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. బుధవారం ఉదండాపూర్ వచ్చిన మంత్రుల బృందాన్ని కలిసి తమ సమస్యలు చెప్పుకొనే అవకాశం కల్పించలేదని, ఉదయాన్నే భూనిర్వాసితులందరినీ అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారని రైతులు వాపోయారు. స్పందించిన ఎంపీ మాట్లాడుతూ నాడు భారాస ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నేటి మార్కెట్ విలువ పరిగణనలోకి తీసుకొని పరిహారం చెల్లించాలని, ఒక్కో రైతుకు రూ. 25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం రైతులు జీవనాధారమైన భూముల కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని, వారిని నిర్బంధిస్తూ భయపెడితే భాజపా చూస్తూ ఊరుకోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 8 ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, ఉదండాపూర్‌తో పాటు నార్లాపూర్, లక్ష్మీదేవిపల్లి భూనిర్వాసితులకు కూడా పరిహారం అందలేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేపడతామన్నారు.

ఉత్తమ పోలీసు రిసెప్షనిస్ట్‌గా జయమ్మ



మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : రాష్ట్రంలోనే ఉత్తమ పోలీస్ రిసెప్షన్ అధికారిగా మహబూబ్‌నగర్ మొదటి పట్టణ ఠాణాలో మహిళా కానిస్టేబుల్ (3597)గా పనిచేస్తున్న జయమ్మ ఎంపికయ్యారు. రాష్ట్రంలోనే ఐదు ఠాణాల్లో పనిచేస్తున్న ఉత్తమ రెసెప్షనిస్లను ఎంపిక చేయగా జయమ్మ మొదటి స్థానంలో నిలిచారు. తర్వాతి స్థానాల్లో నిజామాబాద్‌కు మొదటి పట్టణ ఠాణాకు చెందిన రజనీ, రాచకొండలో మేడిపల్లి ఠాణాకు చెందిన వనిత, రామగుండం జోన్‌లోని గోదావరిఖని మొదటి పట్టణ ఠాణాకు చెందిన వెంకటలక్ష్మి, సిద్దిపేట మూడో పట్టణ ఠాణాకు చెందిన కవిత ఉన్నారు. పోలీస్ స్టేషన్‌కు అనేక రకాల సమస్యలతో వచ్చే వారితో మర్యాదగా మాట్లాడటం, వారి ఇబ్బందులు తెలుసుకుని ఫిర్యాదు రాయడం, వారిని పోలీస్ అధికారి వద్దకు తీసుకెళ్లటం, అవసరమైనప్పుడు పోలీస్ స్టేషన్‌కు పిలవడం, సమస్యను పూర్తిగా పరిష్కరించటంలో జయమ్మ చొరవ, అంకితభావాన్ని గుర్తించి ఎంపిక చేశారు. రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లో ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. గురువారం ఎస్పీ డి.జానకిని మర్యాద పూర్వకంగా కలవగా ఆమె అభినందించించారు. కార్యక్రమంలో మొదటి పట్టణ ఠాణా సీఐ అప్పయ్య, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



బీచుపల్లిలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు


ఇటిక్యాల, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని కోదండ రామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. పండితులు భువనచంద్ర, దినకరాచార్యులు, దత్తుస్వామి, భానుమూర్తి వేదమంత్రోచ్ఛారణలు, భాజా భజంత్రీల నడుమ కమనీయంగా జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ మేనేజర్ సురేందర్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

367.875 మిలియన్ యూనిట్లకు చేరిన జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టు నుంచి వరదనీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి 367.875 మిలియన్ యూనిట్లకు చేరింది. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.186, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 3.581 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. నీటిపారుదలశాఖ అధికారులు జలవిద్యుదుత్పత్తికి 34,499 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునే దిశగా ఎగువన 197.260, దిగువన 170.615 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధ్యపడినట్లు జెన్‌కో ఎస్‌ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

సత్యశోధన కరపత్రం ఆవిష్కరణ

అలంపూర్, న్యూస్‌టుడే: వచ్చే నెల 2వ తేదీన అలంపూర్ ఆలయాల నుంచి ఉమామహేశ్వర ఆలయం బాపూ బాటలో చేపట్టిన 'సత్యశోధన' పాదయాత్ర కరపత్రాన్ని గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ఆవిష్కరించారు. విశ్రాంత విద్యాశాఖ అధికారి శివార్చక విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర జరగనుంది. 100 రోజుల్లో 1,000 కిలోమీటర్లు సాగనుంది. యువత మంచి మార్గంలో నడవాలని ఈ కార్యక్రమం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, తదితరులు

మనమెప్పుడలా..?



పోషకాహారలేమి.. కొరవడిన క్రీడా శిక్షణ



ఉమ్మిత్యాల ప్రాథమికోన్నత పాఠశాలకు ఇదే ఆటస్థలం

వారం రోజుల కిందట జరిగిన హాకీ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ పోటీల్లో భారత్ విజేతగా నిలిచింది. సెమీస్‌లో బలమైన కొరియాపై హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్, జర్మన్‌ప్రీత్ సింగ్, ఉత్తమ్ సింగ్ ఒక్కో గోల్ చేసి జట్టును ఫైనల్‌కు చేర్చారు. ఫైనల్‌లో చైనాతో తలపడినపుడు జుగ్‌రాజ్‌సింగ్ ఏకైక గోల్ చేసి భారత్‌ను గెలిపించారు. భారత్ విజేతగా నిలిచిన వీరంతా సింగ్‌లే.. మరి మనమెప్పుడలా చిరుతల్లా మెరిసేది?

● ఉమ్మడి జిల్లాలో 56 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 17,500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఆటలు ఆడించేందుకు ఒక్కరే పీఈడీ ఉన్నారు.

● గద్వాల పట్టణంలోని అభ్యసన పాఠశాలలో 1,150 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ 2018 నుంచి పీఈడీ, పీఈటీ లేరు. ఇక ఆటలు ఆడించేదెవరు?

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్

క్రీడలపై ప్రభుత్వం ఆసక్తి మాటలకే పరిమితమవుతోంది. పాఠశాల స్థాయిలో నామమాత్రంగా కేటాయిస్తున్న నిధులే అందుకు నిదర్శనం. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ పోటీలకే దాతల సాయం తీసుకోవాల్సిన దుస్థితిలో మనం విజేతలు నిలిచేదెలా?

శిక్షకుల కొరత

ఉమ్మడి జిల్లాలో 3,227 ప్రభుత్వ పాఠశాలలుంటే 3.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి 250 మంది విద్యార్థులకు ఒక పీఈటీ ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే ఐదు జిల్లాలో కలిపి 275 మంది పీఈటీలు, 45 మంది పీఈడీలు మాత్రమే ఉన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 95 ఉన్నత పాఠశాలలకు 42 మంది పీఈడీలు మాత్రమే ఉన్నారు. ఫలితంగా క్రీడలపై విద్యార్థులకు శిక్షణ ఉండటం లేదు.


మైదానాల్లేవు

క్రీడల్లో రాణించాలంటే ప్రతి పాఠశాలకు మైదానం తప్పనిసరి. 236 పాఠశాలల్లో అసలు మైదానాలే లేవు. కళాశాలల్లో కొన్ని చోట్ల నిబంధనల ప్రకారం లేవు. ఒక ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల పరిస్థితి చెప్పనక్కర్లేదు. చిన్నపాటి ఆట స్థలం లేదా పైఅంతస్తుల్లో నిర్వహిస్తున్న పరిస్థితులు కోకొల్లలు. దీనికి తోడు 50 శాతం పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా సామగ్రి లేదు. అరకొరగా ఉన్న వాటితో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు.

దృఢత్వమేదీ?

ఉమ్మడి జిల్లాలో చిన్నారులు పోషకాహార లేమితో బాధపడుతున్నారు. ముప్పై శాతానికి పైగా చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువులేరు. పది శాతానికి పైగా బాలలు అత్యంత పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. ప్రభుత్వం పెడుతున్న మధ్యాహ్న భోజనం కడుపు నింపుతున్నప్పటికీ పోషకాలు అందించడంలేదు. చాలా మంది చిన్నారులు సాయంత్రానికి నీరసించి పోతున్నారు. పోషకాహారం అందించి రోజూ గంటపాటు ఆటలు ఆడించగలిగితే వారిలో శారీరక దృఢత్వం ఏర్పడుతుంది. నిత్య సాధన, వ్యాయామం చేస్తే విశ్వక్రీడా వేదికలపై సాధించి క్రీడల్లో రాణించేందుకు అవకాశం ఉంటుంది. అవేమీ కన్పించడం లేదు.

ప్రోత్సాహం లేదు




క్రీడలకు శిక్షకుల నియామకం మొదలు, నిధుల కేటాయింపుల వరకు సమస్యలే ఉన్నాయి. ఫలితంగానే మన ప్రాంతం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు తయారవడంలేదు. ఉత్తరాఖండ్, పంజాబ్ వంటి ప్రాంతాల్లో ఆటలు ఆడేందుకు అనేక మైదానాలు, శిక్షకులు ఉంటారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు ప్రతి విద్యార్థి మైదానంలో గడపాలనే నిబంధన బూటాన్‌లో ఉంది. అన్ని రకాల క్రీడా సామగ్రి అందించి, పీఈటీల నియామకం చేపడితే వందలో నలుగురు క్రీడాకారులు తయారవుతారు. **-జితేందర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, జోగులాంబ**


తగిన ఆహారం ఇవ్వాలి




పిల్లల్లో పోషకాహారలోపం ఎక్కువగా కనిపిస్తోంది. శారీరకంగా, మానసికంగా, మేధోశక్తి పరంగా బలంగా ఉండాలంటే పిల్లల వయసుకు తగినట్లుగా ఆహారం ఇవ్వాలి. అన్ని రకాల మాంసకృత్తులు ఉండే ఆహారంతో పాటు, ఐరన్, కాల్షియం, ప్రొటీన్స్, విటమిన్-డి ఉండే ఆహారం అందించడం వల్ల ఎముకల పుష్టి బాగా ఉంటుంది. క్రీడలతో పాటు, చదువులోనూ చురుగ్గా రాణించేందుకు అవకాశం ఉంటుంది. **-సుధారాణి, డీడబ్ల్యూవో, గద్వాల**

200 మంది విద్యార్థులను ప్రశ్నిస్తే..







చెరలోనే 10 శాతం స్థలాలు!



న్యాయస్థానం ఉత్తర్వులు అమలయ్యేనా.. ఆక్రమణలు తొలగేనా?



బీరెల్లిదారిలో సగం కబ్జా కాగా మిగిలిన స్థలంలో పార్కు నిర్మాణం

గద్వాల, న్యూస్‌టుడే: పురపాలికల్లో ఇళ్ల స్థలాల విక్రయానికి ఎక్కడ వెంచర్లు వేసినా పది శాతం స్థలం ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించాలి. ఆ తర్వాతే అనుమతులు మంజూరవుతాయి. వాటిని అదే కాలనీలో నివాసం ఉండే ప్రజలకు పార్కులు, చిన్నారులకు ఆట స్థలాలు, ఇతర ఉమ్మడి అవసరాల కోసం వినియోగించాలన్నది పుర నిబంధన. కానీ అమలులో చిత్తశుద్ధి లోపించింది. పార్కుల నిర్మాణం దేవుడెరుగు కబ్జా కాకుండా కాపాడుకుంటే చాలన్న విధంగా పరిస్థితి తయారైంది. గద్వాల పుర పరిధిలో ఇలాంటి స్థలాల విలువ రూ.కోట్లలోనే ఉంది. కానీ వాటికి కాపాడటంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతోంది.

నాడు ఏంచేశారు

గద్వాల నడిబొడ్డున ఉన్న పది శాతం ఖాళీ స్థలాలను గతంలో పాలకులు కులసంఘాల, కమ్యూనిటీ భవనాలు, ప్రార్థనా మందిరాలకు కౌన్సిల్ తీర్మానంతో రాసిచ్చేశారు. వాటిలో గతంలో కొన్ని నిర్మాణాలు వెలిశాయి. తాజాగా కొన్ని నిర్మాణంలో ఉన్నాయి. బీరెల్లి చౌరస్తా, కుంట వీధి, సుంకులమ్మమెట్టు, వేణుకాలనీ, రెండో రైల్వేగేటు, వంటి ప్రధాన కాలనీలలో విలువైన స్థలాలున్నాయి. వీటిలో కొందరు పలుకుబడి గల నేతలు ప్రధాన వ్యక్తుల సొంత నిర్మాణాలు సైతం ఉన్నాయి.

పారదర్శకత ఏదీ

క్షేత్ర స్థాయిలో తొలగింపుల్లో పారదర్శకత లోపించిందంటూ గద్వాల చెందిన రవీందర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించి ఆధారాలతో సహా సమర్పించారు. దీనిపై విచారణ చేసిన హైకోర్టు పురపాలికలో ఆక్రమణ గురైన పది శాతం స్థలాల్లో గతంలో నిర్మించిన ఆక్రమణలు వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. తొలగించి అనంతరం వాటి రక్షణకు తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని పురపాలిక అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో యంత్రాంగంలో కదలిక వచ్చి జులై 22 తేదీన నిర్మాణం పూర్తయిన కుల సంఘాల భవనాలు, ప్రార్థనా మందిరాలకు అధికారులు నోటీసులు ఇచ్చారు. వెంటనే తొలగించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. 15 రోజుల్లో తొలగించని పక్షంలో తామే స్వయంగా చర్యలు తీసుకోనున్నట్లు పుర అధికారులు అందులో పేర్కొన్నారు.

హైకోర్టు ఏం చెప్పింది

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో హైదరాబాద్‌లో పది శాతం స్థలాల ఆక్రమణపై పోలారెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించటంతో కేసు దాఖలైంది. విచారణల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలికల్లో పది శాతం స్థలాల్లో ఉన్న భవనాలు, ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. 2007లో హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పునకు అనుగుణంగా పురపాలిక యంత్రాంగం ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టినా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. కానీ పూర్తిస్థాయిలో తొలగించినట్లు హైకోర్టుకు అప్పటి పుర అధికారులు నివేదిక ఇచ్చారు.

పూర్తి వివరాలతో నివేదించాం

పురపాలికలో పది శాతం స్థలాల తాజా స్థితిపై హైకోర్టు ఆదేశాల మేరకు పూర్తి వివరాలతో జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు త్వరలోనే తీసుకోనున్నాం

-దశరథ్, గద్వాల పురపాలిక అధికారి

ఎల్‌పీ ఉన్న 65 వెంచర్ల వివరాలు (ఎకరాల్లో)					
	కేటాయించిన పది శాతం స్థలం 47.15	పాఠశాలల నిర్మించినవి: 1.75	కమ్యూనిటీ భవనాలున్నవి 2.11	ఇతరాలు 4.11	ఆక్రమణలో ఉన్నవి 7.98

చిన్న వయసులోనే కవిత్వ రచన అభినందనీయం

వెల్దండ, న్యూస్‌టుడే : పాఠశాల స్థాయిలోనే 3వ తరగతి నుంచి 7వ తరగతి చిన్నారులు కవిత్వాలు రాయడం అభినందనీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అజిలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు రచించిన కవిత్వాలు దేవగన్నేరు పుస్తకాన్ని గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డేవిడ్ రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడం, విద్యార్థులతో కవిత్వ రచన చేయించిన ఉపాధ్యాయుల కృషిని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అజిలాపూర్ పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి విద్యతోపాటు వివిధ రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. విద్యార్థుల కవితా రచనకు ప్రోత్సహించిన పాఠశాల తెలుగుపండిట్ తగుళ్ళ గోపాల్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌పీడీ రమేశ్, కవి యాఖూబ్, ఇన్‌ఛార్జి ఎంఈవో చంద్రుడు, నోడల్ అధికారి రవీందర్, ఉపాధ్యాయులు, నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌యాదవ్, లక్ష్మయ్య, కాలే లక్ష్మమ్మ, కేశమళ్ల లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



దేవగన్నేరు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తదితరులు

30న ఉమ్మడి జిల్లా ఎంపికలు

ధన్వాడ, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ ఎంపికల్ని ఈ నెల 30న ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు, పీడీ ఊసు రవికుమార్, కోచ్ శ్రీనివాసులు గురువారం వెల్లడించారు. 14, 17, 19 ఏళ్లలోపు విభాగాల్లో ఎంపికలు ఉంటాయని తెలిపారు. 14 ఏళ్లలోపు విభాగానికి జనవరి 1, 2011, అండర్ 17 విభాగానికి జనవరి1, 2008 తర్వాత జన్మించిన వారే అర్హులన్నారు. విద్యార్థులు ఒరిజినల్ బోనఫైడ్‌తో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

ధన్వాడలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు

ధన్వాడ, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్)లో భాగంగా రెజ్లింగ్(కుస్తీ) పోటీలను వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట జిల్లాలోని ధన్వాడలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.రాంరెడ్డి పేరున జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. అప్పాజీ మైదానంలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 14, 17, 19 ఏళ్లలోపు బాలికల విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోస్గి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 17 ఏళ్లలోపు బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింలు(8179254453)ను సంప్రదించాల్సిందిగా ఉత్తర్వులో కోరారు.

మిల్లు నుంచి సీఎంఆర్ పక్కదారి?

గ్రామస్థులు అడ్డుకోవడంతో గోదాంకు తరలించిన వైనం

పెబ్బేరు, వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ఓ మిల్లు నుంచి సీఎంఆర్ ధాన్యం అక్రమంగా తరలిస్తుండగా.. గ్రామస్థులు అడ్డుకున్న ఘటన గురువారం పెబ్బేరులో చోటు చేసుకొంది. పెబ్బేరు మండలం ఏటిగడ్డ శాఖాపూర్‌లో ఉండే ఓ బియ్యం మిల్లు నుంచి 650 బస్తాల సీఎంఆర్ ధాన్యాన్ని లారీలో ఇతర రాష్ట్రానికి తరలిస్తుండగా గ్రామస్థులు మధ్యలో అడ్డుకున్నారు. ఆ ధాన్యాన్ని పెబ్బేరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మిల్లు యజమాని లీజుకు తీసుకున్న గోదాంకు తరలించి నిల్వ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యం గోదాంలో నిల్వ చేసుకొని మర ఆడించడానికి మిల్లుకు తరలించాల్సి ఉండగా.. మిల్లు నుంచి గోదాంకు ఎలా తరలిస్తారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ధాన్యం తరలింపుపై పోలీసులకు సమాచారం అందిస్తే పట్టించుకోలేదని ఆరోపించారు. వనపర్తి జిల్లాలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు చేస్తున్న సమయంలోనే మిల్లు యజమానులు ధాన్యం తరలించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై జిల్లా పౌర సరఫరాల అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ మిల్లు నుంచి గోదాంకు ధాన్యం బదిలీ చేసుకునేందుకు యజమానికి తమకు దరఖాస్తు చేయలేదన్నారు. ధాన్యం తరలిస్తున్న విషయం తమకు తెలియడంతో సిబ్బందిని పంపించామని, మిల్లు యజమాని లీజుకు తీసుకొన్న గోదాంలో నిల్వ చేసినట్లు విచారణలో తేలిందని ఆయన పేర్కొన్నారు. పౌర సరఫరాల సంస్థ డీఎం ఇర్ఫాన్ మాట్లాడుతూ ఈ నెల 25న తాను కోర్టు పనిపై వెళ్లానని, కార్యాలయంలో అందుబాటులో లేనని చెప్పారు. ధాన్యం బదిలీకి అవకాశం ఇవ్వాలని కార్యాలయంలో దరఖాస్తు సమర్పించినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. డీఎం ఇలా చెబుతుంటే ఈ నెల 25న మిల్లు యజమాని డీఎంకు దరఖాస్తు చేసుకోగా ముద్రలు వేసినట్లు ఫొటోలు బయటకు రావటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.



బియ్యం మిల్లు నుంచి పెబ్బేరులోని మార్కెట్ యార్డులో ఉండే గోదాం వద్దకు తీసుకొచ్చిన సీఎంఆర్ ధాన్యం



మిల్లు యజమాని దరఖాస్తుపై డీఎం ముద్ర

మిల్లు యజమాని జగన్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా తమ మిల్లులో కొన్ని నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండటంతో తప్పని పరిస్థితుల్లో అక్కడి ధాన్యాన్ని తాను లీజుకు తీసుకున్న గోదాంలో నిల్వ చేసేందుకు లారీలో పెబ్బేరుకు తరలించామని పేర్కొన్నారు. పనులు పూర్తయ్యాక మిల్లుకు తీసుకొచ్చి మర ఆడిస్తామని, ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్నామనే ఆరోపణల్లో నిజం లేదని చెప్పారు.

వైద్యవిజ్ఞాన మేళాతో విద్యార్థులకు మేలు

పాలమూరు, న్యూస్‌టుడే : వారం పాటు నిర్వహించిన వైద్య విజ్ఞాన మేళా వల్ల విద్యార్థులకు ఎంతో మేలు కలిగిందని ఎస్‌వీఎస్ ఆసుపత్రి ఎండీ డా.కేజే రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం మహబూబ్‌నగర్ పట్టణం ఏనుగొండలోని ఎస్‌వీఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు వైద్యవిద్యపై ఆసక్తి కలిగితే భవిష్యత్తులో వారు వైద్యులు వైద్యులయ్యే అవకాశం ఉంటుందన్నారు. మేళాలో 25 వైద్య విభాగాలతో 1,200 స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యార్థుల మేళాను సందర్శించి అనేక విషయాలు తెలుసుకున్నారని చెప్పారు. తమ ఆసుపత్రి, వైద్య కళాశాలలను స్థాపించి 25 ఏళ్లవుతున్న నేపథ్యంలో ఈ మేళా నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ ఆసుపత్రి డైరెక్టర్ రాంరెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.జోషి, ప్రసన్న, లింగం, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వీఎస్ ఆసుపత్రి ఎండీ డా.కేజే రెడ్డి, చిత్రంలో డైరెక్టర్ రాంరెడ్డి, ప్రిన్సిపల్ డా.జోషి తదితరులు

సంతోష్‌కు 5 కొలువులు



సంతోష్ కుమార్

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : నేటి పోటీ ప్రపంచంలో ఒక్క ప్రభుత్వ కొలువు సాధించడమే కష్టం.. అలాంటిది ఆ యువకుడు ఏకంగా 5 ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. నారాయణపేట జిల్లా కోస్గి పురపాలకసంఘం పరిధిలోని గుండ్లపల్లికి చెందిన సంతోష్‌కుమార్ ఓవైపు ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే పోటీపరీక్షలకు సిద్ధమయ్యాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో నీటిపారుదలశాఖ ఏఈఈ, పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్, మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక అధికారి, పంచాయతీ రాజ్ ఏఈతో పాటు గ్రూప్-4లో సైతం అర్హత సాధించినట్లు వివరించారు. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలువురికి నియామకపత్రం అందజేశారు. నీటిపారుదలశాఖ ఉద్యోగాన్ని ఎంచుకున్న సంతోష్ ముఖ్యమంత్రి నుంచి నియామక ఉత్తర్వు తీసుకున్నారు. ప్రాథమిక విద్య స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో, 6 నుంచి పదో తరగతి వరకు కోస్గి జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో బీటెక్ పూర్తిచేశాడు. అనంతరం హైదరాబాద్‌లోని స్థిరాస్థి కంపెనీలో ఉద్యోగం చేస్తూనే 2022లో విడుదలైన నోటిఫికేషన్‌లకు దరఖాస్తు చేసి పరీక్షలకు సిద్ధమయ్యారు. తల్లిదండ్రులు వెంకటయ్య, నర్సమ్మలు వ్యవసాయం చేస్తుంటారు. మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన సంతోష్ విజయాలు సాధించడంతో స్వగ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గద్వాలలో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య



అశోక్ (పాతచిత్రం)

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గద్వాలలో చోటు చేసుకుంది. గద్వాల పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ కథనం మేరకు.. పుర పరిధిలోని వేణు అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అశోక్ (42) కేఎల్‌ఐ క్యాంపులోని నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ 1 కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఇటీవల సీనియర్ అసిస్టెంట్‌గా పెబ్బేరుకు బదిలీ అయ్యారు. బుధవారం సాయంత్రం తాను కార్యాలయ పనిపై హైదరాబాద్‌కు వెళ్తున్నానంటూ తన భార్య వీరావతికి చెప్పి వెళ్లాడు. గురువారం ఉదయం అశోక్ ఇదివరకు గద్వాలలో పని చేసిన కార్యాలయాన్ని అటెండర్ తెరిచి లోపలికి వెళ్లగా కార్యాలయంలోని ఓ ఛాంబర్‌లో అశోక్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. ఆందోళనకు గురైన అటెండర్ కార్యాలయ సిబ్బందికి, పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు, అధికారులు చేరుకుని ఫ్యాన్‌కు వేలాడుతున్న అశోక్‌ను కిందకు దించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధరించారు. ఆర్థిక సమస్యల వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భార్య ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చెప్పారు. కాగా తాను షేర్‌మార్కెట్‌లో రూ.50 లక్షలు డిపాజిట్ చేశానని, ఇందులో తన స్నేహితులవి రూ.20 లక్షలు ఉన్నాయని రాసి జేబులో పెట్టుకున్న ఓ కాగితాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అశోక్ మృతికి పలు ఉద్యోగాల సంఘ నాయకులు సానుభూతి వ్యక్తం చేశారు. అశోక్‌కు కొందరు వడ్డీ వ్యాపారులు అప్పులు ఇచ్చారని, వడ్డీ విషయంలో కొందరు అతడిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని సన్నిహితులు అంటున్నారు.

చికెన్ ధరలు



ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

తెరపై ఈనాడు

శ్రీనివాస - దేవర, బాలాజీ - దేవర, తిరుమల - దేవర, వెంకటేశ్వర - దేవర, వెంకటాద్రి - దేవర, శ్రీకృష్ణ - మత్తు వదలరా 2 - న్యూటౌన్, మహబూబ్‌నగర్ పట్టణం

వృద్ధుల వైద్య సేవలకు ప్రత్యేక విభాగం

పాలమూరు, న్యూస్‌టుడే: వైద్యం కోసం వచ్చే వృద్ధులకు సత్వర సేవలు అందించడానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వృద్ధులకు ప్రత్యేక వైద్య చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఈ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. బీపీ, మధుమేహం, మోకాళ్ల నొప్పులు, శ్వాస కోశ సమస్యలు, ఉదర సంబంధమైన సమస్యలు, కంటి, గుండె, ఇతర వైద్య సేవల కోసం రోజూ 250 నుంచి 300 మంది వరకు వృద్ధులు వస్తుంటారు. వారంతా ఆయా విభాగాలు ఎక్కడున్నాయో తెలియక, నడవలేక ఇబ్బంది పడుతుంటారు. ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులువుగా సేవలను పొందే అవకాశం ఉంది. ఔషధాలను ఇచ్చే గది పక్కనే చికిత్స కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. మంగళ, గురువారాల్లో మాత్రమే ఈ కేంద్రంలో వైద్యసేవలు అందిస్తారు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి పరీక్షలు నిర్వహిస్తారు.

జిల్లాకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల రాక

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పదోన్నతులపై గ్రేడ్-1గా జిల్లాకు బదిలీపై రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లో పనిచేస్తున్న నరేశ్‌కుమార్, ఆదిలాబాద్‌లో పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, హన్మకొండలో పనిచేస్తున్న రాజేశ్వర్‌రావు తదితరులు గ్రేడ్-2 నుంచి పదోన్నతి పొంది గ్రేడ్-1గా జిల్లాకు వస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తున్న రాంబక్ష్ కరీంనగర్‌కు కోర్టుకు పదోన్నతిపై వెళ్తున్నారు.

మైసమ్మ ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: కాకర్లపహాడ్ గ్రామ సమీపంలోని పర్వతాపురం మైసమ్మ ఆలయ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేస్తూ దేవాదాయధర్మాదాయ శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ అధ్యక్షుడిగా కాకర్లపహాడ్ గ్రామానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్లుగా రామస్వామి, మల్లేశ్, కేశవత్ మెగ్యా, శివరాజు, రవీందర్, అంజనేయులు, రమాదేవి, బాలకిష్టయ్య, బాలస్వామి, శాంతయ్య, నర్సింహులు, రాంచంద్రయ్య, రవిలను ఎంపిక చేశారు. త్వరలో నూతన కమిటీ పదవీ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ అమలుపై క్షేత్ర పరిశీలన

హన్వాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్ అమలుపై అధికారులు క్షేత్ర పరిశీలన చేశారు. మండల కేంద్రంలో 189 మంది గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వాటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రభుత్వం సూచించడంతో పంచాయతీ కార్యదర్శి దీప్తి, నీటి పారుదల శాఖ ఏఈ బాబా తాఫీక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాదిక్‌లతో కూడిన బృందం ప్రతి ఇంటి వివరాలను సేకరించారు. వివరాలు జిల్లా అధికారులకు సమర్పిస్తామన్నారు.

వివాదంపై డీఎస్పీ విచారణ

హన్వాడ, న్యూస్‌టుడే: మునిమోక్షంలో నాలుగు రోజుల క్రితం రెండు వర్గాల మధ్య జరిగిన గొడవపై డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం విచారణ జరిపారు. ఇక్కడ రెండు వర్గాల మధ్య గొడవ జరగగా నలుగురికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో కాశీం, మహిళలు కొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు చేయమని ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఏఎస్సై సాయిబాబాతో కలిసి వచ్చి విచారణ జరిపారు.

పోలీసుల అదుపులో చోరీ కేసు నిందితులు ?

జడ్చర్ల: ఈనెలలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఒక ఇంట్లో తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తాజాగా పోలీసులు సేకరించిన ఆధారాల ఆధారంగా ఇద్దరు నిందితులను గుర్తించి అదుపులో తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. నిందితులు స్థానికులే కావడం విశేషం.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మిడ్జిల్ : బోయినపల్లికి చెందిన కృష్ణయ్య కుటుంబ సభ్యులు గురువారం పొలానికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.21వేలు చోరీ చేశారు. సాయంత్రం ఇంటికి రాగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ నారాయణరెడ్డి పరిశీలించి, వివరాలు సేకరించారు.

విద్యార్థినికి అస్వస్థత

గండీడ్, న్యూస్‌టుడే: తరగతి గదిలో ఓ విద్యార్థిని స్పృహ తప్పి కిందపడిపోయిన ఘటన గండీడ్ మండలంలో చోటుచేసుకుంది. రుసుంపల్లి పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న బాలిక తరగతి గదిలో గుండె దగ్గర నొప్పి వస్తుందని చెప్పి స్పృహతప్పి కిందపడిపోయింది. ఉపాధ్యాయులు సీపీఆర్ చేస్తూ 108లో జిల్లాసుపత్రికి తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.





మహబూబ్‌నగర్: రైల్వేస్టేషన్ చౌరస్తాలో ఐలమ్మ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం.. నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు.. చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పుర మాజీ అధ్యక్షుడు కేసీ నర్సింహులు, తదితరులు

చాకలి ఐలమ్మ నేటితరానికి ఆదర్శం



మహబూబ్‌నగర్‌లో భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఇతర పార్టీ నేతలు



దేవరకద్రలో..

తెలంగాణ వీరవనిత, సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో ఐలమ్మ విగ్రహానికి, చిత్రపటాలకు ప్రజా ప్రతినిధులు నాయకులు, రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకెళదామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైల్వేస్టేషన్ చౌరస్తాలో రజక రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలోని ఐలమ్మ విగ్రహానికి పురపాలక మాజీ అధ్యక్షుడు కేసీ నర్సింహులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జమీందారులు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తి కోసం విముక్తికి ఎర్రజెండా నాయకత్వంలో పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు, కిల్లె గోపాల్, ఎన్.కురుమూర్తి అన్నారు. తెలంగాణ కూడలిలో ఐలమ్మ చిత్రపటానికి భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్చర్ల, దేవరకద్ర, రాజాపూర్, గండీడ్, నవాబుపేట, అడ్డాకుల తదితర మండలాల్లో ఐలమ్మ జయంతిని నిర్వహించారు.



గండీడ్‌లో...

–న్యూస్‌టుడే, బృందం

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొన్నకల్ గ్రామంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల్లో విజేతలకు గురువారం ఎమ్మెల్యే బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు వచ్చే నెలలో సీఎం కప్పు పేరుతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో కురుమూర్తి, నాయకులు శ్రీహరి, నాగార్జునరెడ్డి, జగదీశ్వర్, విజయ్‌మోహన్‌రెడ్డి, హేమవర్ధన్‌రెడ్డి, డీఎల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మిడ్జిల్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీ డీకే అరుణ కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన జడ్చర్ల, మిడ్జిల్, ఊర్కొండ మండలాల పార్టీ సభ్యత్వ నమోదులో ఎంపీ పాల్గొన్ని మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. భాజపా జిల్లా శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, తిరుపతి, రాజేశ్వర్, సాహితిరెడ్డి, బాలవర్ధన్‌గౌడ్, లక్ష్మారెడ్డి, నరేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ గ్రామీణం: జిల్లా కేంద్రంలోని సింహగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఎంపీ డీకే.అరుణ దర్శించుకొని పూజలు నిర్వహించారు. అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. పూజల అనంతరం శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో దీన్‌దయాళ్ జయంతిని పురస్కరించుకొని ఎంపీ మొక్క నాటారు.

రైల్వే వంతెన పనులు సాగేందుకు చర్యలు

జడ్చర్ల: రైల్వే వంతెన పనుల్లో జాప్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులతో మాట్లాడి పనులు ముందుకు సాగేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ డీ.కె.అరుణ అన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో గురువారం పర్యటించిన ఆమె జాతీయ రహదారి-167 జడ్చర్ల సిగ్నల్ గడ్డ రైల్వే వంతెన నిర్మాణం పనులు పరిశీలించి మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వే అధికారులతో మాట్లాడి జాప్యానికి కారణాలు, అన్ని అనుమతులు ఉన్నాయా, గుత్తేదారు నిర్లక్ష్యమా తెలుసుకొని పనులు చేపట్టేలా చూస్తామన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహులు, బాలవర్ధన్‌గౌడ్, నాగరాజు, సాహితిరెడ్డి, కృష్ణయ్య, జగదీశ్ పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తిలో సింగరేణి భాగస్వామ్యం సరికాదు



ఎస్ఈ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విద్యుత్తు ఉద్యోగులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు ఉత్పత్తి సంస్థలో సింగరేణి సంస్థను భాగస్వామ్యం చేయడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహబూబ్‌నగర్‌లోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఐకాస నాయకులు మాట్లాడుతూ రామగుండంలోని విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని సింగరేణి భాగస్వామ్యంతో నిర్వహించాలన్న ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఎస్ఈ పీవీ.రమేశ్, ఏడీలు నవీన్‌కుమార్, సంతోష్, ఐకాస నాయకులు పాండునాయక్, స్వామి, బాబియా, గంగాధర్, రామరాజు, విజయకుమార్, కుర్షిత్‌జాన్, సరిత పాల్గొన్నారు.

‘పాత పింఛను విధానం పునరుద్ధరించండి’



అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేతలు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పింఛన్ విధానం వద్దంటూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలు ధరించి పింఛన్ ఆక్రోశ్ మార్చ్ నిరసన తెలియజేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు సీపీఎస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, కోశాధికారి రాఘవేంద్ర, నాయకులు వెంకటయ్య గౌడ్, గోవర్ధనాచారి, గోవర్ధన్, కృష్ణ పాల్గొన్నారు.

గండీడ్, న్యూస్‌టుడే: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్‌సీపీఎస్ఈయూ సంఘం సభ్యులు అన్నారు. గురువారం మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశం అనంతరం తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, టీపీఆర్టీయూ, యూటీఎఫ్ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, ఘంటా శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీ శాఖ ప్రాంతీయ క్రీడా పోటీలు ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: అడవులను సంరక్షించుకుంటేనే మనుగడ సాధ్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం డీఎస్ఏ మైదానంలో ఏర్పాటు చేసిన అటవీ శాఖ ప్రాంతీయ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అడవులు తగ్గడంతోనే అతి వృష్టి, అనావృష్టితో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అడవులను కాపాడే ముఖ్యమైన బాధ్యత అటవీ శాఖ సిబ్బందిపైనే ఉందన్నారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్, అటవీ శాఖ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థులకు బూట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యాభివృద్ధికి అండగా ఉంటానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బైరంపల్లి, కంచనపల్లి, వస్పుల, చిల్వేరు, కొత్తపల్లి, వెలుగోముల గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వంత నిధుల నుంచి ఎమ్మెల్యే గురువారం బూట్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన ఉంటుందన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదువుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. బైరంపల్లి గ్రామ శివారు దుందుభి వాగులో రూ.8.50కోట్ల వ్యయంతో చెక్‌డ్యాం నిర్మాణం పనులకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీవో గీతాంజలి, ఎంఈవో సుధాకర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నాయకులు అల్వాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, గౌస్, శివప్రసాద్, రమేశ్, నర్సింహులు, రాజారెడ్డి, బాబా, సత్యంగౌడ్ పాల్గొన్నారు.

పురపాలికలో వృద్ధుల సంక్షేమ కమిటీ ఏర్పాటు



సభ్యులకు సూచనలు ఇస్తున్న సీఐ అప్పయ్య. చిత్రంలో పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: నెల రోజుల్లోగా పురపాలికల్లో సీనియర్ సిటిజన్ సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో కదలిక మొదలైంది. మహబూబ్‌నగర్ పురపాలికలో గురువారం సీనియర్ సిటిజన్ సంక్షేమ కమిటీ ఏర్పాటైంది. మహబూబ్‌నగర్ పుర కమిటీలో అధ్యక్షుడిగా కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, మెప్మా పీడీ ఎంకేఐ అలీ, ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎండీ అస్గర్‌అలీ, సీడీపీవో రాధిక, స్వచ్ఛంద సంస్థలకు చెందిన నాగభూషణం, అహ్మద్‌అలీ సభ్యులుగా ఉన్నారు. కమిటీ పురపాలిక పరిధిలో పూర్తిస్థాయి అధికారాలతో పనిచేయాల్సి ఉంటుంది. వృద్ధులపై కుటుంబ సభ్యులు దాడికి పాల్పడి గాయపరిచినా, వారిని నిర్బంధించి వేధింపులకు గురిచేసినా, ఇళ్ల నుంచి గెంటివేసినా ఈ కమిటీలు గుర్తించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించి సమస్య పరిష్కరిస్తారు.

పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలి



పారిశుద్ధ్య కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే పట్టణ వీధులు శుభ్రంగా ఉంటాయని పురపాలక ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పురపాలిక ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు ఎలాంటి దురాలవాట్లకు బానిస కారాదన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీధర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎండీ.అస్గర్‌అలీ, పురపాలక షానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి, జవాన్లు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్య పరిష్కరించాలని ధర్నా



రహదారిపై ధర్నా చేస్తున్న తండా వాసులు

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: తండాలో నాలుగు రోజులుగా విద్యుత్తు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యుత్తు అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని ముందలితండా వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మహబూబ్‌నగర్ - చించోళి రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా తండా వాసులు మాట్లాడుతూ నాలుగురోజులుగా ఇళ్లలో విద్యుత్తు సరఫరా లేక అవస్థలు పడుతున్నామని అధికారులు వచ్చి సమస్య పరిష్కరించే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై శేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

శ్రీరాం కాలనీ అభివృద్ధి కమిటీ నియామకం

మహబూబ్‌నగర్ పట్టణం: ఏనుగొండ శ్రీరాం కాలనీ సంక్షేమ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.సిద్ధు, ఉపాధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా జి.అంజన్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రవికుమార్, కోశాధికారిగా ఎస్.వెంకటేశ్, కార్యదర్శిగా లింగంగౌడ్, సంఘటన కార్యదర్శిగా యాంకి ఆచారి ఎన్నికయ్యారు. కాలనీ పెద్దలు రఘు యాదవ్, శేషన్న, జి.నిరంజన్, మురళీకృష్ణ, నరేందర్‌ల సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు.

రామయ్యబౌలిని ముంచెత్తిన వరద

పాలమూరు పురపాలకం: పెద్దచెరువు అలుగునీరు రామయ్యబౌలి వీధులను ముంచెత్తింది. గురువారం సాయంత్రం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో పాటు ఇప్పటికే పారుతున్న కొత్త చెరువు నీరు పెద్దచెరువులోకి భారీగా చేరడంతో అలుగునీరు పొంగి రామయ్యబౌలి వీధుల్లో ఉద్ధృతంగా పారుతోంది. చాలా మంది ఇళ్లలోకి, మరికొందరి ఇంటి ఆవరణల్లోకి వరద నీరు చేరింది. రామయ్యబౌలి వార్డు కౌన్సిలర్ అబ్దుల్ రషీద్ ఇంట్లోకి కూడా నీరు చేరడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న పురపాలక సిబ్బంది మోటార్లు బిగించి ఇంట్లోకి చేరిన నీటిని బయటకు తోడేశారు. సుమారు ఐదు ప్రధాన వీధులను అలుగునీరు ముంచెత్తడంతో చాలా కుటుంబాలు బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి రామయ్యబౌలి వీధుల్లో పర్యటించి ధైర్యం చెప్పారు. పురపాలిక ద్వారా ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.



రామయ్యబౌలి వీధుల్లో వరద నీరు

విద్యుదాఘాతంతో ఒకరి మృతి.. **గండీడ్, న్యూస్‌టుడే:** ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ మీద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గండీడ్ గ్రామానికి చెందిన వెంకటయ్య(55) తన ఇంటి నిర్మాణంలో భాగంగా బేస్‌మెంట్‌కు టిప్పర్ జాకీ సహాయంతో పైకి లేపి మట్టిని పోస్తుండగా టిప్పర్ ట్రాలీకి విద్యుత్తు తీగ తగిలి తెగి టిప్పర్ పక్కన నిలబడిన వ్యక్తిపై పడింది. ఈ క్రమంలో ఆ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై స్పృహ తప్పి కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.



వెంకటయ్య

మురుగు కాల్వలో పడి.. **మిడ్జిల్, న్యూస్‌టుడే:** మండలంలోని చిల్వేరు గ్రామంలో మురుగు కాల్వలో పడి వ్యక్తి దుర్మరణం చెందినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన కృష్ణయ్యగౌడ్(33) ఆరు బయటకు వచ్చి ప్రమాదవశాత్తు మురుగు కాల్వలో పడి వరద నీటికి కొట్టుకుపోయి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చెట్టుపై నుంచి.. **మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే:** మహబూబ్‌నగర్ మండల పరిధిలోని చౌదరిపల్లి గ్రామానికి చెందిన దర్పల్లి మన్యం (52) గురువారం ఉదయం టీడీ గుట్ట ప్రాంతంలో కూలీల అడ్డాలో ఉండగా చెట్టు కొట్టడానికి సమీపంలోనే పనికి వెళ్లాడు. చెట్టు కొడుతుండగా కాలు జారి కిందపడ్డాడు. వెంటనే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మొదటి పట్టణ ఠాణా సీఐ అప్పయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం.. **జడ్చర్ల, న్యూస్‌టుడే:** జడ్చర్ల మండలం పోలేపల్లి పారిశ్రామికవాడ ముఖద్వారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌లోని వానగుట్ట ప్రాంతంలో నివాసం ఉండే బాలమ్మ(32) భర్త చనిపోవడంతో నాలుగేళ్లుగా పిల్లలను వదిలి ఒంటరిగా జీవిస్తోంది. కాగితాలు ఏరుకొని జీవించేది. బుధవారం అర్ధరాత్రి ఆమెను జాతీయ రహదారి 44 పోలేపల్లి పారిశ్రామికవాడ ముఖద్వారం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడే దుర్మరణం చెందింది. మృతురాలి బంధువు శిరీష గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహితపై అత్యాచారం.. నిందితుడిపై కేసు

నవాబ్‌పేట: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వివాహిత బహిర్భూమికి వెళ్లగా గ్రామానికి చెందిన బొంత శివ అనే వ్యక్తి ఆమెపై అత్యాచారం చేసినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం.. **రాజాపూర్, న్యూస్‌టుడే:** రాజాపూర్, మల్లేపల్లి శివారుల్లోని దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.రవి తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్ ఫిర్యాదు మేరకు మల్లేపల్లిలో పట్టుకున్న ట్రాక్టర్ డ్రైవర్ వడ్డె నరేశ్‌పై కేసు నమోదు చేశారు. రాజాపూర్‌లో పట్టుకున్న ట్రాక్టర్ డ్రైవర్ పారిపోవడంతో ఇతర డ్రైవర్ ద్వారా ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించారు. యజమాని లేదా డ్రైవర్‌ను గుర్తించి కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి బోల్తాపడిన ఆటో.. **మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే:** ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు మహిళా ఉపాధ్యాయినులు గాయపడ్డారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. హన్వాడ మండలంలోని మునిమోక్షం ప్రభుత్వ పాఠశాలలో జ్యోతిబాయి, కవిత, రుక్మిణీ ఉపాధ్యాయినులుగా పని చేస్తున్నారు. గురువారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి పాఠశాలకు ఆటోలో బయలుదేరారు. హన్వాడ సమీపంలోకి వచ్చే సరికి అకస్మాత్తుగా ద్విచక్రవాహనం రహదారిపైకి రావడంతో వేగంగా వెళ్తున్న ఆటో ఆ వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో జ్యోతిబాయికి కాలు, చేయి విరిగింది. మిగతా ఇద్దరు ఉపాధ్యాయినులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కంటెయినర్‌ను ఢీకొన్న డీసీఎం.. **అడ్డాకుల, న్యూస్‌టుడే:** ముందు వెళ్తున్న కంటెయినర్‌ను వెనక నుంచి డీసీఎం ఢీకొన్న సంఘటన అడ్డాకుల సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. . కర్నూలు వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కంటెయినర్ అడ్డాకుల సమీపంలోకి చేరుకోగానే బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం ముందు వెళ్తూ అకస్మాత్తుగా బ్రేక్ వేసిన కంటెయినర్‌ను ఢీకొంది. ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం..

అడ్డాకుల, న్యూస్‌టుడే: అడ్డాకుల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(20) బుధవారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి పడుకుంది. గురువారం తెల్లవారుజామున లేచి చూసేసరికి కనిపించలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

అడ్డాకుల: అడ్డాకుల మండలంలోని ఓ గ్రామానికి చెందిన భార్యభర్తలు తమ గొర్రెలను మేత కోసం మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి శివారులోకి వచ్చారు. ఈ క్రమంలో గురువారం గొర్రెల మందుల కొరకు భర్త మహబూబ్‌నగర్ వెళ్లి తిరిగి వచ్చేసరికి భార్య కనిపించలేదు. పలు చోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

రాజాపూర్: కోయిలకొండ మండలంలో ఓ తండాకు చెందిన యువతి(18) రాజాపూర్ మండలంలో అదృశ్యమైంది. ఎస్సై కె.రవి కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో ఉన్న బావ ఇంటికి నెల రోజుల క్రితం యువతి వచ్చింది. బుధవారం మధ్యాహ్నం కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం యువతి బావ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవాబ్‌పేట: మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో గురువారం ఎల్‌హెచ్‌పీఎస్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముడావత్ సంతోష్‌నాయక్, గౌరవ అధ్యక్షుడిగా శంకర్‌నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చందునాయక్, అసోసియేట్ అధ్యక్షుడిగా అంబదాస్, ఉపాధ్యక్షులుగా రాంచందర్, సంతోష్, సేవ్యా, ప్రధాన కార్యదర్శిగా మంగ్యానాయక్, కార్యదర్శులుగా గోవిందు, వినోద్, సహాయ కార్యదర్శులుగా సక్రియా, చందర్, కోశాధికారిగా వెంకటేశ్, మహిళా అధ్యక్షురాలిగా జ్యోతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.